# 3

# కదలిక

"నా మనసులోంచి ఆబోతు
కదలిపోయింది. మనిషికి
చేరువగా వచ్చేయి
నా ఆలోచనలు."

అచ్చు వేసివిడిచిన ఆబోతును ఎప్పుడైనా చూసి వుంటే నా గురించి ప్రత్యేకంగా పరిచయం చేసుకోవలసిన అవసరం లేదు. దానికి, నాకు చాలా పోలికలు ఉన్నా కొట్టవచ్చినట్లు కన్పించే ఒక భేదం అది జంతువు. నేను మనిషిని. దానికి నాలుగు కాళ్లూ, తోకావంటివి ఉంటే నాకు రెండు కాళ్లూ, వాటిని అంటి పెట్టుకొని ఒక పేంటూ, రెండు చేతులూ, సగం వరకు వాటిని కప్పుతూ ఒక లాల్చీ వంటివి ఉన్నాయి. ఇంకా ఇటువంటివే ఏ కొద్దో గొప్పో తేడాలు లేకపోలేదు. అయినా రోజు గడుపుతున్న తీరులో, జీవితాన్ని అనుభవించే రీతిలో మా ఇద్దరికి చెప్పుకోదగ్గ పోలికలు ఉన్నాయి. దానికి ఆలోచించే శక్తి లేక ఏమీ పట్టించుకోకుండా, పనిచేయవలసిన అవసరం లేక రోడ్లవెంట తిరుగుతూంటే, ఏ విషయం గురించీ ఆలోచించే ఆసక్తి లేక, బాగుపడాలన్న కోరిక లేక బజార్లంట, బస్సు స్టాపుల దగ్గర తిరుగులాడుతుంటాను నేను.

రాత్రి పగలు కష్టించి పనిచేసే ఎద్దుకి తగినంత మేత దొరకనే దొరకదు. మరి ఆ జాతికే చెందిన ఆబోతు చేసుకొన్న అదృష్ట మేమిటి? రాత్రి పగలు కోమటి కొట్టులో చింకి గోనెపట్టాకి అతుక్కుపోయి పని చేసే అన్నయ్యకి సరిగా తిండీ, బట్టా అమరకపోయినా, ఆ ఇంటనే పుట్టి, పెరుగుతున్న నేను మూడు ముస్తాబులై పీకల మొయ్యా తిండి తింటూ సోమరిపోతులా తిరిగేందుకు కారణం ఏమిటి?

ఆబోతు అదృష్టం గురించి నాకంతగా తెలియదు కాని నా అదృష్టం మా అమ్మ నా చిన్నతనంలో చచ్చిపోవడమే అని చెప్పగలను. తల్లి చావు అదృష్ట మేమిటని ఆశ్చర్యపోతున్నారా? చూసేందుకు,

చేసేందుకు ఎవరూ లేకుండా తల్లి వదలిపోతే అంతకు మించిన దుర దృష్టం వేరొకటి ఉండదు. కాని మా వదినవంటి అమాయకురాలి చేతిలో పెట్టి, ఆఖరి కోరిక అంటూ అప్పగింతలు పెట్టి ఆమెచే ఒట్టు వేయించుకొని అమ్మ చచ్చిపోవడమే నా అదృష్టానికి కారణం.

తను చేస్తున్న ప్రతి పనిని అత్తగారు ఆ లోకంనుంచి జాగ్ర త్తగా పరిశీలిస్తున్నాదని నమ్మే వదిన తన కడుపు కట్టుకొని, భర్త చేత తిట్లుతింటూ మరదిని ఆబోతుకుమల్లె మేపుతున్నది. తల్లిలేని బిడ్డ దనేజాలితో ఎలా ఆడిస్తే అలా ఆడుతూ మరదిని పెంచుకొస్తు న్నాది. వదిన భగవంతు డిచ్చిన వరం నాకు. ఆమె అభిమానమే నా కాళ్లకు బలం.

బిగుతుగా కూర్చుంటే పిగిలిపోయేలా వంటికి అతుక్కుపోయి ఉండే పేంటూ, మోచేతుల పై వరకు మడచి ఉండే ఫుల్ హేండ్సు షర్టు, సగానికి క్రాసుగామడచి కాలరు కిందుగా బిగించి కట్టిన సిల్కు జేబురుమాలు, ధనలక్ష్మి కటాక్షం ఉండే రోజుల్లో చూపుడు వేలుకి, మధ్యవేలుకి మధ్యగా పొగలు చిమ్ముతూండే సిగరెట్టూ—ఇదీ నా అలంకరణ.

ఎదుట పడిన ఏ ఆడపిల్లా కళ్లింతింత చేసుకొని నోరు వెళ్లబెట్టి. నా వంక చూడకుండా తప్పుకుపోరు! నుదుటి మీదికి పడుతున్న ఉంగరాల జుట్టు ఎగిరిపడేలా ఒక సారి తల ఎగురవేసి, రెండువేళ్లనీ నోటిలోకి పోనిచ్చి హుషారుగా ఈల వేస్తే అసహ్యంతో ముఖం తిప్పకనూ పోరు. నన్ను చూసి వాళ్లలా ముఖం తిప్పుకొని చీదరించు కొంటుంటే నా కెందుకో సరదా.

ఈ కారణం వల్లనే ఉదయ సాయంకాలాలలో అమ్మాయిలు దం డిగా ఎక్కే దిగే బస్సుస్టాపుల దగ్గర బీటు వెయ్యడం నాకు తప్పని సరి అయిన దినచర్యగా తయారయింది. సాధారణంగా నెంబరు ఎనిమిది బస్సులో అందమైన ఆడపిల్లలు మందలుగా దిగుతుంటారు ఆ స్టాపులో. మనుష్యుల గురించి చెప్తున్నప్పుడు మందలుగా అన కూడదు కామోసు. ఏదో ఒక సారి పొరపాటున అంటే జంతువులు మరీ అంతగా కోపగించుకొంటా యనుకోను. అంతగా తగవుకి సిద

మైతే ఏదో నోరు జారి అనేసేనేకాని మిమ్మల్ని అవమానపరచాలనే ఉద్దేశం నా కెంతమాత్రం లేదని వాటికి నమ్మకం కుదిరేలా నచ్చ చెప్పుకొంటే సరిపోతుంది.

ఆఁ, ఏమి చెప్తున్నాను? నెంబరు ఎనిమిది బస్సుస్టాపు గురించి కదూ! ఆ స్టాపులో రోజూ చాలమంది అందమైన అమ్మాయిలు దిగుతారు. నా కోసం అనుకొనేరు సుమండీ.... మీరు అలా భావించి నన్ను అందలం ఎక్కిద్దామనుకొన్నా నేను అబద్ధం చెప్పను. ఆ చుట్టుపక్కల రెండు మూడు కాలేజీలు ఉండడం. అందులో ఒకటి ఆడపిల్లల స్వంతం అవడం అందుకు కారణం.

ఆ రోజు అమ్మాయిలు మరీ అందంగా అలంకరించు కొన్నారు. విరబూచిన పూదోటలో రంగురంగుల పువ్వుల్లా ఉన్నారు. అప్పుడే సినిమా సెట్టుమీంచి దిగి వచ్చిన తారల్లా ఉన్నారు. జిలుగు వెలుగుల బట్టలు, దొండపండ్లవంటి పెదవులు, నిగనిగలాడుతూ నల్లని గొంగళి పురుగులవంటి కనుబొమ్మలు—ఇక్కడ వర్ణన సరిగా కుదరలేదు కదూ? ఈ మాట నా నోటికే వెలపరంగా తగులుతున్నాది. ఎంతో మోటుగా నాలాగే రోజూ ఆ చుట్టుపక్కల తిరిగే అబోతులాగే ఉన్నాది. సరే మరి నోరుజారేక ఇంకేం చెయ్యడం? ఇంకో సారి ఇంతకన్న అందంగా, లలితంగా వర్ణించేందుకు ప్రయత్నిస్తాను.

సరే ఏమైతేనేమి ఆ రోజు నా మనస్సు ఉత్సాహంతో కుప్పి గంతులు వేసింది. నన్ను నేను ఎంతగా మరచిపోయానంటే తల ఎగురవెయ్యడం. ఈల వెయ్యడంవంటి అతి సహజమైన పనులు కూడా మరచిపోయి వారి వంకకే రెప్ప వెయ్యకుండా చూస్తూ ఉండి పోయేను.

ఎత్తి పట్టుకొన్న గంపలోంచి రాసిగా పడుతున్న పువ్వుల్లా బస్సు లోంచి దిగుతున్నారు అమ్మాయిలు. జలపాతపు హోరుని మించి ఉన్నాయి వారి నవ్వులు, మాటలు. సగానికి పైగా బస్సు కాళీ అయి పోయింది. మిగిలిన పాసెంజర్లు, కండక్టరుతో సహా ముఖాలలో విసుగుదల, విచారం చూపిస్తూ వారికి కళ్లప్పగించి కూర్చున్నారు.

అమ్మాయిలు దిగిపోవడంతో బస్సులోని అందం తరలిపోయిందనో, వాళ్ళ పెళ్ళి వారిలా తాపీగా దిగుతూంటే వేళకి సరిగా ముందు సాపు చేరుకోబడదనే అసహనమో కండక్టరు చిర్రుబుర్రులాడుతూ 'దిగండి దిగండి' అంటూ తొందర చేస్తున్నాడు.

అందమైన గులాబి పువ్వును ఆప్యాయంగా చేతిలోకి తీసుకోబోతే కసుక్కున వేలికి గ్రుచ్చుకొన్న ముల్లులా అంత మంది అందమైన అమ్మాయిల వెనుకగా ఒక ముసలివాడు ముడుతలు బడిన ఒళ్ళూ, పండబారిన జుట్టూ, చీదర పుట్టించే రూపూ, కంపుకొట్టే బట్టలూ, మూర్తీభవించిన దారిద్ర్యంలా, కూడ గటుకొన్న కుళ్ళులా, ఒక చేతిలో ఏదో మందు సీసా, రెండో చేతిలో వెలిసిపోయిన పువ్వుల గుడ్డతో కుట్టిన చేతి సంచీ పట్టుకొని మెల్లగా దిగుతున్నాడు.

నా కెంతో జాలి వేసింది. ఆ ముసలివాణ్ణి చూసి కాదు. వాడి రూపును చూస్తూ, ఆ కంపును భరిస్తూ అంత దూరం అదే బస్సులో ప్రయాణం చేసివచ్చిన అందమైన అమ్మాయిల్ని చూసి. ముష్టివాళ్ళకి కుళ్ళుబట్టలవాళ్ళకి వేరుగా బస్సులు పెడితే ఎంత బాగుండును! కనీసం అందమైన అమ్మాయిలు ఎక్కే బస్సులో ఇటువంటి కంపు వెధవల్ని ఎక్కించకుండా కట్టడి చేసినా కొంత బాగుండును- అనుకొన్నాను.

పాపం, ఆడపిల్లల్ని అంత సేపు తన రూపుతో తన కంపుతో బాధ పెట్టింది చాలక ''అమ్మా కాస్త తప్పుకొని నన్ను దిగనీండి తల్లీ! నా క్కాస్త చోటియ్యండి అమ్మా'' అంటూ వాళ్ళని త్రోసుకొని, ముందుకి రావడానికి ప్రయత్నిస్తున్నాడు వాడు. కాస్త దూరంగా నిలిచి వారంతా దిగే వరకు ఆగకుండా ఏదో కొంప మునిగిపోయినట్లు అలా తోసుకు వస్తున్న వాడిని చూస్తే రెండు తన్న బుద్ధి అయింది నాకు.

ఆఖరి అమ్మాయి దిగుతూంటే వాడు చొరవగా ముందుకువచ్చి అడుగులో అడుగు వేసేడు. ఆ పిల్ల కోపంగా చూసింది. "ఏయ్ కళ్ళు లేవూ? కాలు తొక్కుతావేం? గబ్బు కంపు కొట్టుకొంటూ. కాస్త ఎడంగా ఉండు'' అంది. ''ఎంతకని ఆగేది తల్లీ! పెళ్ళివారిలా మీ

రంతా దిగే సరికి అక్కడ తలుపులు మూసేస్తారు. మళ్లా తెల్లవారితే కాని మల్లిని చూడ నివ్వరు. కాస్త తప్పుకు దారీయండి తల్లీ. మీ కెంతైనా పుణ్యం ఉంటుంది" అన్నాడు. "మల్లీ, ఉల్లీ అంటూ మీది మీదికి వస్తావేం? ఒక్కొక్కరూ దిగుతున్నామా?" అప్పుడే క్రిందికి దిగిన అమ్మాయి విసిరి కొట్టింది మాటని కళ్లెర్రజేస్తూ.

ఆఖరి అమ్మాయి దిగిపోయింది. ముసలివాడు ముందుకి వచ్చేడు. ఒక్క అడుగు నేలమీద మోపేడు. 'రైట్' అన్నాడు కండక్టరు బెల్లు నొక్కుతూ. బస్సు బుర్ మంటూ ముందుకి దూసుకుపోయింది.

అమ్మాయిలు ఏ చక్రవర్తి ఆగమన సమయంలోనో రోడ్డమీద చల్లిన రంగు రంగుల పువ్వుల్లా పక్క రోడ్డంతాపరచుకు నడుస్తున్నారు. తల ఎగరవేయడం మరచిపోయిన నన్ను చూసి బస్సు స్టాపు దగ్గరఉన్న బోర్డు ఫక్కున నవ్వింది. 'మరీ అంత తన్మయత్వ మేమి' టని పరిహసించింది.

బస్సు దిగుతూ ముసలివాడు తూలి పడ్డాడు. దుమ్ముకొట్టుకొన్న రోడ్డుమీద బోర్ల పడ్డాడు. చేతిలోని మందుసీసా ముందుకు దొర్లుకుంటూ పోయింది. సంచిలోని బత్తాయి పళ్లు కుళ్లు కాలువదిక్కుగా ప్రయాణం సాగిస్తున్నాయి. అదే ఎవరైనా అమ్మాయి అయితే పరుగున వచ్చి ఆమె పడకుండా పట్టుకొందును. పారిపోతున్న పళ్లని చేతిలోకి తీసుకొని మెడకి చుట్టుకొన్న సిల్కు రుమాలు విప్పి, వాటి దుమ్ము దులిపి, చూపులో చూపు కలిపి సాదరంగా అందిద్దును. కాని పడింది ముసలివాడాయెను. అందులో ఆ కుళ్లు బట్టలతో కంపు కొడుతూ.... ఆ మరేం పరవాలేదు. ఏదో బస్సు జోరుకి ఆగలేక తూలి పడ్డాడు. వాడే లేస్తాడు. పోతే పోయాయి వెధవపళ్లు. మళ్లా కొనుక్కొంటాడు'- అనుకొన్నాను.

క్రింద పడ్డ ముసలివాడి దృష్టి పళ్లమీద లేదు. నాలుగు గజాలు ముందుకి దొర్లిపోయిన మందు సీసాని అందుకొనేందుకు ఆత్రంగా లేచేడు. లేచినట్టే లేచి మళ్లా పడ్డాడు. ఈసారి నేలకి చేతు లానించి లేవబోయేడు. కాస్త ఎత్తుకి లేచి తిరిగి పడ్డాడు. మూడో సారి పడ

డంతో మందు సీసాకి కొస్త దగ్గరగా వచ్చేడు ఆశగా చేయి జాచేడు అడుగు దూరంలో నిలచి అది వాడిని వెక్కిరిస్తున్నాది. ఇంక లేచి లాభం లేదనుకున్నాడో ఏమో; చంటి వాడిలా నేల మీద ముందుకి ప్రాకసాగేడు.

ఇదంతా చెప్పేందుకు ఇంతసేపు పట్టింది. కాని జరిగిపోడానికి రెండు నిముషాలు కూడా పట్ట లేదు. ఆ స్టాపులో ఆగని బస్సు రయ్ మంటూ దూసుకొని వచ్చింది. బస్సుకి గజం దూరంలో రోడ్డు రంగులో కలసిపోయి మందుసీసా కోసం ప్రాకుతున్న మానవా కారాన్ని డ్రయివరు చూడ లేదు. వాడి పాటుని చూసినవాడిని నేను. నాతోపాటుగ బస్సుస్టాపు గుర్తు తగిల్చిన కర్ర కూడా చూసింది. అది కదలలేక ఊరుకొంది. నేను కదల గలిగి ఊరు కొన్నాను.

బస్సుకి కీచ్ మంటు సడన్ బ్రేక్ పడింది. మునలివాడి చేతి కందిన మందు సీసా పగిలి పోయింది. బస్సు వెనుకగా వస్తున్న నాలుగైదు వాహనాలు ఆగేయి. పది మంది మనుష్యులు, ఏమయిం దంటూ మూగేరు. ఎర్ర బస్సులోంచి ఎన్నో తలలు పైకి కన్పిం చేయి. ఎర్రటోపీ పోలీసు అందరినీ తోసుకొంటు ముందుకి వచ్చేడు.

"ఏమయింది? ఏమయింది?" అంతా అడిగే వారే. చెప్పాలను కొంటే ఏమైందో నేను చెప్ప గలను. కాని నాకు చెప్పాలనిపించ లేదు. చెప్పేనంటే సవాలక్ష ప్రశ్నలు దూసుకు వస్తాయి. మనిషి చచ్చిపోతుంటే చూస్తూ ఊరుకొన్నావా? అంటారు. అసలు అంత విసురుగా వాడిని పడదోసి తిరిగి చూడకుండా వెళ్లిపోయిన కండక్టరు ఎవ రంటారు. ఆబోతులా ఇంత పెరిగి వున్నావు కదా, వాడి దవడ ఎందుకు పగలకొట్టలే దంటారు.

అక్కడికి ఇవన్నీ నేను చెయ్యవలసిన పనులే అన్నట్లు అవి చెయ్యకపోవడంవల్ల నేనే దండనార్హుణ్ణి అన్నట్లు. నాకేం ఆ ముసలి వెధవని ఉద్ధరించి దీనజన రక్షకుడనే బిరుదు తగిలించుకోవాలని లేదు. అదృష్టం తిన్నగా లేక ఆ బస్సు నామీంచిపోతే? నా కింత

తొందరగా చచ్చిపోవలసిన అవసరం లేదు. అందులో అటు వంటి వాడికోసం నే నెందుకు చావాలి? నాది చీకూ, చింతా లేని జీవితం. హాయిగా తింటూ, అందమైన అమ్మాయిల్ని చూస్తూ, అవకాశం కలిసివస్తే ఇంకా చిన్న చిన్న ఆనందాల్ని అనుభవిస్తూ బ్రతుకు తున్న నేను.... ఏ వేళకి వెళ్లినా విసుక్కోకుండా కడుపునిండా అన్నం పెడ్తుంది వదిన. ఆ అమాయకురాలు నేనేం చెప్పినా—నమ్మి ఊరుకొంటుంది....ఆబోతులా పెరిగి పోతున్న నన్ను పట్టకొని కొట్టి, దండించి దారిలోకి తెచ్చే శక్తి అన్నయ్యకి లేదు. అతనికి నాపట్ల ఏకాన్త ఆసక్తి! అయినా మిగులుంటే దానిని కోమటికొట్టు గోనెపట్టా తినివేస్తుంది. ఇంక మా స్కూలంత మంచి స్కూలు దేశం మొత్తంలో లేదు. ఏడాదికోసారి మీ పిల్లడి పరీక్ష పోయింది అన్న కాగితం మినహా నెల నెలకీ రిపోర్టులు పంపి ఇటు విద్యార్థుల్ని, అటు తల్లిదండ్రుల్ని ఇరుకులో పెట్టరు. అందు వల్లనే అన్నయ్యకి ఓపిక ఉన్నంతకాలం చదువుకొనేందుకు నాకు పట్టింపు లేదు. నేను చావుకి సిద్ధంగా లేకపోయిందికి ఈ కారణాలు చాలవూ?

ముసలివాడి సంచిలోని బత్తాయిపళ్లు కుళ్లు కాలువ దిక్కుగా ప్రయాణించి చెత్తకుప్ప దగ్గర ఆగిపోయేయి. అప్పుడే పక్క వీధి లోంచి పొగరుగా మూపురం ఊపుకుంటూ వచ్చిన ఆబోతు వాటిని తీరికగా ఆరగిస్తున్నాది. అది వాటిని అప్యాయంగా ఆరగిస్తుంటే నేను ముచ్చటగా చూస్తున్నాను. మిగిలిన వాళ్లంతా ముసలి వెధవ చుట్టూ మూగి సానుభూతివర్షం కురిపిస్తున్నారు. వాడు బ్రతికుండగా గబ్బుకంపు అని కసరుకొన్న అమ్మాయి కూడా వెను తిరిగి చూసి 'అయ్యో పాపం' అంది. అక్కడ చేరిన అందరినీ వాడి చావు కద లించింది _ నన్నూ, ఆబోతునీ తప్ప.

అది అక్కడ జరుగుతున్న గొడవలేమిటో, తను ఆరగిస్తున్న పళ్ల హక్కుదారుడు ఎవరో అన్న ఆలోచన లేకుండా తృప్తిగా తిని, హాయిగా నెమరువేసుకొంటూ, ప్రక్కనే ఉన్న ఎలక్ట్రిక్ స్తంభానికి మూపురం రాసుకొంటూ ఆనందిస్తున్నాది.

నేను ఎదురుగా మూగిఉన్న గుంపు మధ్య ఏమున్నదో తెలిసికూడా చూడాలనే ఉత్సుకతలేక, అయ్యోపాపం అనే విచారం లేక, అందమైన ఆడపిల్లల్ని తీసుకువచ్చే ఇంకొక బస్సు కోసం ఎదురు చూస్తూ పేవ్‌మెంటుమీద పచార్లు చేస్తున్నాను. ఇది మా ఇద్దరికీ మధ్యనున్న సామ్యం.

అరగంట పైగా గడచినా ఇంకొకబస్సు రాలేదు. అప్రయత్నంగా గుంపువైపు మళ్లింది నా చూపు. అందులో చిన్న పగులు ఇచ్చింది. ఆ సందులోంచి కన్పించేయి ఆ ముసలివాని కళ్లు బ్రతికుండగా నేను పరీక్షగా చూడని కళ్లు. పత్తికాయల్లా విడిపడ్డ కళ్లు, నా వంక జాలిగా చూస్తున్న కళ్లు. నాకెందుకో వాటినిచూస్తే భయం వేసింది. కళ్లుమూసుకొని పరుగుతియా లనిపించింది. నా మంచంమీద పడుకొని రగ్గుని బుర్రమీదుగా కప్పుకోవా లనిపించింది.

ఆబోతు ఆ కళ్లని ధైర్యంగా చూసి ప్రక్క వీథిలోకి తప్పుకు పోయింది. 'రా నేస్తం పోదాం పద' అంటూ నా వంక చూపింది. నేను ఆబోతుని అనుసరించలేకపోయేను. నా మనసు నా స్వాధీనం తప్పింది. ఏదో శక్తి నా కాళ్లని కదలకుండా నొక్కి ఉంచింది. దూరంగా వెళ్లిపోతున్న ఆబోతు విచారంగా వెనుతిరిగి చూపింది. 'రావా' అన్నట్లు బుర్ర ఊగించింది. ఆ మందలో కలుస్తే ఇంక నీదారి నీదే, నాదారి నాదే అన్నట్లు తోక ఆడించుకొంటూ వెళ్లిపోయింది.

ఆబోతు నాకు దూరమయింది. మనుష్యులను ఒత్తిగించుకొంటూ నేను ముందుకి నడిచేను. ముసలివాడి కళ్లు పత్తికాయల్లా, జాలిగా నావంక చూస్తున్నాయి. నన్నేదో అర్థిస్తున్నాయి.

ముసలివాడి దేహాన్ని అక్కడినుంచి తరలించడంతో గుంపు అంతా కరగిపోయింది. కనుచీకటి మిగిలిన వాళ్లని ఇళ్లకి తోలింది. విరిగిన మందుసీసా గాజు పెంకులు జమాదారు బుట్టలోకి ఎత్తుకున్నాడు. దానికి సమీపంలోఉన్న కాగితం గాలికి ఎగురుతూ నాకాళ్ల ముందుకి వచ్చింది. అది మందు చీటి. కుమారి మల్లికి ముసలివాడు

కొనుక్కుపోతున్న మందుచీటి. నలిగిన ఆ కాగితపు మడతలలోంచి నేను చూడని మల్లి కళ్లు నన్నేదో అర్థిస్తున్నటు కన్పించేయి. ఎక్కడో ఆ మల్లి ఈ ముసలివాడి కోసం ఎదురు చూస్తుంటుంది. అర్థాంతరంగా వీడిలా నాటకం ముగించేడు ఆ పిల్లకి ఈవిషయం ఎవరు చెప్తారు? ఆ మల్లికి ఏవయసువుంటుంటో? ఎలా ఉంటుందో?

ఆలోచిస్తునే బస్సు ఎక్కేను. పుస్తకాలు కొంటానని వదిన దగ్గర పుచ్చుకొన్న సొమ్ము ఇంకా జేబులోనే ఉంది. దురదృష్టవశాత్తు ఊర్లో మంచి సినిమాలు ఆడటంలేదు. పదిసార్లు చూసిన డొక్కులే మళ్లా మళ్లా వస్తున్నాయి. లేకుంటే ఈ సొమ్ము ఏనాడో ఖర్చయిపోయి ఉండేది.

బజారులో షాపులు చాల వరకు మూయబడి ఉన్నాయి. ఆ రోజు ఆదివారం, సెలవు రోజు. వీధి మలుపులో ఉన్న మందులషాపుకి వెళ్లేను. షాపులో ఎవరూ లేరు. తలుపుమీద రెండు, మూడు సారు తట్టగా ఒక చిన్న పిల్ల తొంగి చూసి "నాన్నా ఎవరో వచ్చారు" అంది. ఊడిపోతున్న పంచిని సరిచేసుకొంటూ షాపు యజమాని లోపలినుంచి వచ్చేడు. అతని నివాసం కూడా అదే అయి ఉంటుంది.

చీటి చూసి మందు అందిస్తూ నా వంక పరకాయించి చూసేడు. రోగి పేరు, డాక్టరు పేరు తన పుస్తకంలో వ్రాసుకొంటూ 'ఆ ముసలివాడు మీ కేమవుతాడు?' అంటూ ప్రశ్నించేడు.

'ఏ ముసలివాడు?' అన్నాను.

'ఈ రోజు ఉదయంనుంచి నా పీకలమీద కూర్చుని సాయంకాలం మందు పటుకుపోయిన ముసలివాడు'. వాడి రూపురేఖలు వర్ణిస్తూ 'మీ బంధువా' అని ప్రశ్నించేడు.

'అతడు అంత సేపు ఎందుకు కాచుకు కూర్చోవలసి వచ్చింది? మీ దగ్గర కావలసిన మందులు లేవా?' అన్నాను.

'నా షాపులో మందులు లేకపోవడం అంటూ ఉండదు. అతని దగ్గర డబ్బులు లేవు. ఉచితంగా ఇచ్చేందుకు ఇదేం ధర్మాసుపత్రి కాదు' అన్నాడు.

బస్సు దిగేందుకు ముసలివాడు పడ్డ ఆత్రతత నాకు గుర్తు కొచ్చింది.

'మరి సాయంకాలానికి మాత్రం వాడి దగ్గర డబ్బు ఎలా వచ్చింది?'

'ఏమో, నాకేం తెలుస్తుంది? ఎక్కడైనా కూలీ నాలీ చేసేడో, అపహరించేడో నే నెలా చెప్పగలను? డబ్బు తెచ్చేడు. మందు ఇచ్చేను. ఇంతకీ అతడు మీ కేం అవుతాడు?'

ఆ షాపువాడు మా బాంధవ్యం గురించి అన్ని సార్లు ప్రశ్నించేందుకు కారణం వేషభాషల్లో మా మధ్య ఉన్న వ్యత్యాసమే.

'ఏమీ కాదు. అతడు చచ్చిపోయేడు' అన్నాను, మందు సీసాని చేతిలోకి తీసికొంటూ.

'అయ్యో పాపం....ఏమయింది? ఎలా చచ్చిపోయేడు?'

అతని ప్రశ్నలు వినిపించుకోకుండా నేను బయటికి వచ్చేను. మందు చీటిమీద వ్రాసి ఉన్న ఎడ్రసుకి బయలు దేరేను. వీథి గుమ్మంలో బోర్డు చూసి అదే స్థలమని నిర్ధారించుకొని లోపలికి అడుగు పెట్టేను. అది ఒక ప్రయివేటు ఆసుపత్రి. ఒక హాలు, నాలుగు చిన్న గదులు. చుట్టూ వరండా ఉన్నాయి. ముందు వరండాలో నౌకరు ఒకడు కునుకుపాట్లు పడుతున్నాడు. గదుల్లో రోగులు మూలుగుతున్నారు. మల్లిని చూడాలని నా మనసు తహతహ లాడుతున్నాది.

'డాక్టరుగారు వీథిలోకి వెళ్లేరు. తొమ్మిది దాటితే కాని రారు. అసలు ఈ సమయంలో ఎవరినీ చూడరు' అన్నాడు నౌకరు.

'నాది చాల ముఖ్యమైన విషయం. ఏ వేళకైనా డాక్టరు గారిని చూసి మరి వెళ్తాను' అంటూ హాలులో ఉన్న ఒక పాత బెంచీ మీద కూర్చున్నాను.

పది గంటల సమయంలో వచ్చేడు డాక్టరు. నా చేతిలో మందు చీటి చూపించేను. బాగా ఎండిపోయి డొల్లవిడిచిన చెట్టుకొమ్మలా అతడు నామీద పెళపెళ విరుచుకు పడ్డాడు.

'ఏమయ్యా. ఈ విధంగా మీరు రోగుల్ని మా నెత్తికి రుద్ది తిరిగి చూడకపోతే మేం ఏంకావాలి? ప్రాక్టీసు వదలుకొని అడవులు పట్టి

పోవడం మినహా గత్యంతరం లేదు అర్జంటుగా మందు తెమ్మని చిన్న రాత్రి అనగా మందుచీటి వ్రాసిఇస్తే ఇప్పటికా తీసుకురావటం? ఎటునుంచి ఏమైనా నింద మా తలకి చుట్టడమూనా? ఏడీ ఆ ముసలి వాడు? చేర్చుకొనేవరకు నా ప్రాణం తీసి....' హాలు ప్రతిధ్వనించేలా అరుస్తునే ఉన్నాడు. అతని అరుపులకు ప్రక్క గదిలోంచి ఒక చంటి పిల్ల భయపడి ఏడుపు అందుకొంది.

'ఆ ముసలివాడు బస్సుకింద పడి చచ్చిపోయేడు' అన్నాను నెమ్మదిగా.

'మరి నువ్వు....వాడి కేమవుతావు?' కళ్లింతింత చేసుకొని డాక్టరు ప్రశ్నించేడు.

'ఏమీ కాను, అతడి చావు చూసేను. అతడి చేతిలోంచి పడి పగిలిన మందుసీసా చూసేను. ఈ మందు ఆ పిల్లకి ఉపయోగపడుతుందేమో అని కొని తీసుకు వచ్చేను.'

క్షణకాలం క్రిందట అంతగా గర్జించిన మేఘం టపటప నాలుగు చినుకులు రాల్చింది. చేతిలో రుమాలుతో ముఖం తుడుచుకుంటూ. 'ఆ పిల్ల సాయంకాలమే పోయింది. తెల్లవారే వరకు చూచి, ఇంకా అతడు రాకపోతే....' డాక్టరుమాట పూర్తి చేయకుండానే నౌకరు వైపు తిరిగి 'నర్సయ్యా! ఆ పిల్ల శవాన్ని తెచ్చి ఇతనికి ఇచ్చేయి' అన్నాడు.

'నేనేం చేసుకోను' అన్నాను భయంగా. అప్పటికి నా వయస్సు ఇరవైలోపు. కాని ఒడ్డూ, పొడుగూ వల్ల పాతికేళ్ళ పైబడ్డ వాడిలా కన్పిస్తాను. దయ్యాల కథలు విని నే నెప్పుడు జడుసుకోపోయినా, దెయ్యాలంటే నమ్మకం లేకపోయినా చచ్చిపోయిన వాళ్లని చూసేందుకు నాకు ఇష్టంగా ఉండదు. ప్రమాదవశాత్తు ఎప్పుడైనా ఏ శవం అయినా కంటపడితే ఆ రూపు, ఆ చూపు నన్ను పదిరోజుల వరకు వెంటాడుతుంది. ఆకలి వెయ్యదు. నిద్ర రాదు. ఏదో కడుపులో కలచినట్లు ఉంటుంది.

చిన్నప్పుడు అమ్మంటే నా కెంతో అభిప్రాయం ఉండేది. కాని అమ్మ చచ్చిపోయినప్పుడు ముఖం చూసేందుకైనా ఆవాయలకి

పోలేదు. ఎవరో చేయి పట్టుకు తీసుకు వెళితే చేయి కరచి బయట పడ్డాను. ఆ కారణంగానే ముసలి వాడిని చూసేందుకు గుంపులోకి దూరలేదు. అయినా వాడి కళ్లు నన్ను వెంటాడుతూనే ఉన్నాయి. ఇప్పుడు ఈ పిల్ల శవాన్ని నే నేం చేసుకోను? అదే మాట అన్నాను.

'మేముమాత్రం ఏం చేస్తాం? మీరు కాదంటే రేపు మున్సిపాలిటీ బండిలో పడేస్తాం' అన్నాడు అతను.

ఎందుకో ఆ మాట నాకు కష్టం కలిగించింది. ఒకరోజు కిళ్లీ కొట్టువాడు లేని సమయంలో అరటిపళ్ల గెలని అందుకొని, తిన్నంత తిని, మిగిలింది కాళ్లతో కుమ్మివేసిన ఆబోతు జ్ఞాపకం వచ్చింది. మరునాడు చెత్తల బండివాడు దానిని ఎత్తుకుపోవడం గుర్తు కొచ్చింది. ఈ పిల్ల శవాన్ని కూడా ఆబోతు కుమ్మివేసిన అరటిపళ్ల గెలలా.... 'సరే.. నేను తీసుకుపోతాను' అన్నాను.

నాలుగేళ్ల పాప శవాన్ని గుడ్డలో చుట్టి నా చేతుల్లో పెట్టేడు నర్సయ్య. ఆ ముసలివానికి ఈ చిన్న పిల్లకి మధ్య వుండే బాంధవ్య మేమిటి? మనసులో ప్రశ్న లేచింది. మనిషికీ మనిషికి మధ్య ఉండే బాంధవ్యం. మనసుకీ మనసుకీ మధ్య ఉండే మమకారం. ఈ నిశి రాత్రిలో ఒంటరిగా ఇంతదూరం ఈ బరువును మోసుకొచ్చిన నీకూ, ఈ పిల్లకీ ఉన్న సంబంధము ఏమిటి?

రాత్రి గడచి పోతుంటే ఊరికి దూరంగా ఉన్న చింత తోపులో దొరికిన కర్రముక్కతో గొయ్యి త్రవ్వి, ఆ చిన్నారి కాయాన్ని పూడ్చి పెడుతుంటే, నా మనసు ప్రశ్నించింది. ఆ లేత బుగ్గలమీద మన్ను కుమ్మరిస్తుంటే నా కంటిలో మెరసిన ఒక కన్నీటి బొట్టు ప్రశ్నించింది.

నాకు గుర్తున్నంతవరకు ఎదుటివారి పట్ల జాలితో నా కళ్లలో నీళ్లు ఆ రోజునే మొదటిసారిగా తిరిగేయి.

ఇల్లు చేరేసరికి అన్నయ్య, వదిన నా కోసం కాచుకు కూర్చు న్నారు. 'రెండో ఆట సినీమావాళ్లు వెళ్లిపోయి కూడా చాలా

సేపయింది. ఇంతవరకు ఎక్కడ తిరుగుతున్నావు? ఈ చలిలో అర్ధరాత్రి పూట వీధులంట ఇలా తిరుగుతుంటే....'

వదిన మాట పూర్తికాలేదు. అన్నయ్య చేయెత్తి నా చెంపమీద రెండు అంటించేడు. 'ఊరుకొంటుంటే నీ వరసేం బాగుండడం లేదు. చెప్పు ఇంతరాత్రి వరకు ఎక్కడ తిరుగుతున్నావు? మీ వదిన దగ్గర పుస్తకాలు కొంటానని తీసుకుపోయిన డబ్బు ఏం చేసేవు?' అన్నయ ఒంటిలోని శక్తినంతా కూడదీసుకొని అడా పెడా తగిలించేడు. నేను జవాబు చెప్పలేదు. ఆశ్చర్యంగా అన్నయ్యని చూస్తూ నిలబడిపోయేను. అన్నయ్య చేతి దెబ్బలుకూడా ఆ రోజునే మొదటిసారిగా తిన్నాను.

నాలో ఆబోతు పోలికలు ఉన్నంతకాలం అన్నయ్యకి చెయ్యెత్తే సాహసం లేకపోయింది. కొమ్ములతో పొడిచి కుమ్మి కుప్ప పెడతానేమో అని భయపడి ఉంటాడు. ఇప్పుడు నా మనసులోంచి ఆబోతు కదిలిపోయింది. మనిషికి చేరువగావచ్చేయి నా ఆలోచనలు. అందుకే అన్నయ్యకి నన్ను దండించే శక్తి, ఆసక్తి వచ్చేయి.

అంతకు పూర్వం అన్నయ్య ఈ విధంగా దండించి ఉంటే ఏమీ పట్టించుకోకుండా తల ఎగురవేసి తప్పుకుపోయి ఉందును. కాని ఆరోజు అన్నయ్య మందలింపు నా మనసంతా నిండిపోయింది. ఆ దెబ్బలతో నా మత్తుఅంతా వీడిపోయింది. జరిగిన విషయం చెప్తే ఎవ్వరూ నమ్మరు. నా సంగతి తెలిసి ఉన్న అన్నయ్య అసలే నమ్మడు. 'డబ్బు పోయింది. వెతుకుతూ ఉండిపోయేను' అన్నాను.

నా మాట అబద్ధమని అన్నయ్యకి తెలుసు. కాని ఇంకా కొట్టేందుకు ఒంటిలో శక్తిలేదు. ఆ మాట అబద్ధమని నా మనసుకి తెలుసు. కాని నిజం చెప్పినందువల్ల కలిగే ఫలితంలేదు. ఆ మాట అబద్ధమని ముసలి తాత ఆత్మకి తెలుసు. చింత తోపులో ఒంటరిగా నిద్రపోతున్న మల్లికి తెలుసు. కాని వాళ్లు ఎదుటపడి చెప్పలేరు.

ఆనాటి కలత నిద్రలో ముసలివాడి కళ్లు కృతజ్ఞతగా నా వంక చూసేయి. 'నీ ఋణం తీర్చుకోలేను' అన్నట్లు చూసేయి.

ఇందులో ఎవరు ఎవరికి ఋణపడ్డాం? ఈనాటికీ నాలో నిలచి పోయింది ఈ ప్రశ్న.